క్లుప్తంగా

మసీదు నిర్మాణానికి భూమి పూజ



పాత గుంటూరు: తూర్పు నియోజకవర్గం ఒకటో వార్డులోని రాహుల్ గాంధీ నగర్ నాలుగో లైన్ మెయిన్ రోడ్డు వద్ద నూతనంగా నిర్మించనున్న షమీమ్ మసీదుకు ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ ముస్తఫా ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థన చేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ముస్లింలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో డివిజన్‌ కార్పొరేటర్ కామిరెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు అధ్యక్షతన సోమవారం జరగనుంది. మొత్తం 166 అంశాలతో కూడిన ప్రశ్నలు, ప్రతిపాదనలు, నగరపాలక సంస్థ ప్రియాంబుల్ (ఉపోద్ఘాతం)తో సమావేశం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలియజేశారు.

కోవిడ్ ఫైటర్ షేక్ అజ్మతుల్లా కుటుంబానికి ఆర్థిక సాయం



గుంటూరు ఎడ్యుకేషన్: కరోనా మహమ్మారి ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న సమయంలో కన్నవారే దగ్గరకు రాని విపత్కర పరిస్థితుల్లో కులమతాలకు అతీతంగా మృతులకు దహన సంస్కారాలు నిర్వహించిన కోవిడ్ ఫైటర్స్ టీం సభ్యుల్లో ఒకరైన షేక్ అజ్మతుల్లా మరణం దిగ్భ్రాంతికి లోను చేసిందని బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు బండి అశోక్ రెడ్డి పేర్కొన్నారు. గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్ అసోసియేషన్, బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆదివారం కోవిడ్ ఫైటర్ అజ్మతుల్లా ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి రూ.76 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వాకింగ్ ట్రాక్ అసోసియేషన్ కార్యదర్శి గుర్రాల శివశంకర్, సభ్యులు ఐ.కె.వి.ప్రసాద్, మిలటరీ యూసఫ్, సత్తార్, జిలానీ, మన్సూర్, ముస్తఫా పాల్గొన్నారు.

ఖాతాదారుల శ్రేయస్సే పరమావధి



నెహ్రూనగర్: వ్యాపారాలు విస్తరించి లాభాలు గడించాలంటే నిజాయతీ, నాణ్యతతో కూడిన ఉత్తమ సేవలు అందించడం ఒకటే మార్గమని క్రేన్ గ్రూపు సంస్థల అధినేత గ్రంధి వెంకట సత్య లక్ష్మీ కాంతారావు పేర్కొన్నారు. ఖాతాదారుల శ్రేయస్సే పరమావధి కావాలని సూచించారు. ఆదివారం కొత్తపేట చిన్న మహాలక్ష్మమ్మ దేవాలయం దగ్గర ముప్పిరిశెట్టి వారి వీధిలో రామ్ రాజ్ కాటన్ వారి నూతన ఉత్పత్తుల జిల్లా డిస్ట్రిబ్యూటర్ మీనాక్షి ట్రేడర్స్‌ను స్థానిక కార్పొరేటర్ పోతురాజు సమతతో కలసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూటర్లు కోట నితీష్, అద్దెపల్లి రాము మాట్లాడుతూ దేశంలోనే నాణ్యమైన ఉత్పత్తులకు మారుపేరుగా ఉన్న రామరాజ్ కాటన్ ధోతీస్, షర్ట్స్, బనియన్స్ జిల్లా డిస్ట్రిబ్యూటర్లుగా సేవలందిస్తున్నామని తెలిపారు.

నగరపాలక సంస్థ 'స్పందన' వాయిదా

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం సోమవారం జరుగుతున్న నేపథ్యంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని సమస్యలపై నగరపాలక సంస్థలోని కాల్ సెంటర్ 0863-2345103కి చేయవచ్చని ఆమె సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గుంటూరు రూరల్: యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990-91 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 34 ఏళ్ల తర్వాత చౌడవరంలో ఆత్మీ సమ్మేళనం నిర్వహించుకుని, ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి పాఠశాల జ్ఞాపకాలను, నేటి పరిస్థితులను చర్చించుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని నిర్ణయించారు. నాటి విద్యార్థులు తంగెళ్ళ నాగేశ్వరరావు, ఓబులుశెట్టి రామకృష్ణ, పొల్లా శ్రీనివాసరావు, మొగిలిచర్ల వీరాంజనేయులు, ఇల్లూరి ఏడుకొండలు, ఏమినేడి కోటేశ్వరరావు, కొత్తమాసు సీతారామయ్య, చట్లా రామయ్య, పాపూరి సోమయ్య, ఎ.శౌరయ్య ఉన్నారు.

రైల్వే గేటు దాటని కష్టాలు

- సమస్యగా మారిన నగరంలో పలు ప్రధాన మార్గాల్లో రైల్వే క్రాసింగ్‌లు
- రైల్వే గేటు పడితే...గంట ఆగాల్సిందే..
- నగర ప్రజలకు తప్పని అవస్థలు
- సమస్యల పరిష్కారానికి నగరపాలక సంస్థ ముందడుగు



సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద వేచి ఉన్న వాహనదారులు

నెహ్రూనగర్: రోజురోజుకీ నగరంలో ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. నగర ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక రైల్వే క్రాసింగ్‌ల వద్ద పరిస్థితి చెప్పనక్కరలేదు. నగరంలో పలు ప్రధాన మార్గాల్లో రైల్వే క్రాసింగ్‌లు ఉన్నాయి. దీంతో అక్కడ రైలు వచ్చిన ప్రతిసారి గేటు పడితే చాలు...వాహనదారులకు ఇక్కట్లే. ప్రతి రైల్వే క్రాసింగ్ వద్ద రెండు ట్రాక్‌లు ఉండటంతో అరగంట వరకు రోడ్డుపై ఆగాల్సిందే ! గేటు తీసినప్పటికీ అప్పటికే రోడ్డు మొత్తం ట్రాఫిక్‌తో నిండిపోవడంతో వాహనదారులకు ఆ చక్రవ్యూహం నుంచి బయటకు రావాడానికి నానా తంటాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా నెహ్రూనగర్ ప్రాంతం మూడు రైల్వే క్రాసింగ్‌ల మధ్య ఉండటంతో స్థానిక ప్రజలు చుక్కలు చూడాల్సిన పరిస్థితి.

వాహనదారుల ఇబ్బందులు

ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూలుకు వెళ్లే చిన్నారులు, వాహనదారులు, ఇతర అత్యవసర పనుల నిమిత్తం వెళ్లేవారు పొరపాటు ఈ రైల్వేగేటుల నుంచి వెళ్లాల్సి వస్తే నరకమే. రైలు గేటు దాటి వెళ్లినా కూడా గేటు తీయని పరిస్థితి పలు రైల్వే క్రాసింగ్‌ల వద్ద కనిపిస్తోంది. స్కూల్‌కి వెళ్లే సమయంలో గేటు పడితే చిన్నారులు కింద నుంచి దాటుకుని వెళ్లాల్సిన పరిస్థితి. ఒకవేళ్ల రైలు ట్రాక్ మీదే నిలిచిపోతే చేసేదేమి లేక వెళ్లేదాక వేచి చూడాల్సిన పరిస్థితి. స్కూల్ సమయం అయిపోతే ఇక ఇంటికి వెళ్లక తప్పదు. ఇప్పటికైనా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో రైల్వే గేట్లు వద్ద ప్రతిపాదించిన ఆర్‌యూబీ, లేదా ఆర్‌ఓబీ నిర్మాణాలు చేపట్టాలని వాహనదారులు, నగరవాసులు కోరుతున్నారు.

ఆర్‌యూబీ, ఆర్వోబీ నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం

గుంటూరు నగరంలో రద్దీ గల పలు ప్రధాన రైల్వే క్రాసింగ్‌ల వద్ద ఆర్‌యూబీ(రోడ్ అండర్ బ్రిడ్జి), ఆర్‌ఓబీ (రోడ్ ఓవర్ బ్రిడ్జి)ల నిర్మాణానికి రైల్వే, మున్సిపల్, ఆర్ అండ్ బీ అధికారులతో కలసి పలు ప్రతిపాదనలు చేశారు. సంజీవయ్య నగర్, శ్యామలానగర్ రైల్వే క్రాసింగ్‌ల వద్ద ఆర్‌యూబీ, ఇన్నర్ రింగ్ రోడ్(గడ్డిపాడు), నెహ్రూనగర్ రైల్వే క్రాసింగ్‌ల వద్ద ఆర్‌ఓబీల నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినప్పటికీ వాటిని అమలు చేయడం సాధ్యం కావడం లేదనే చెప్పుకోవాలి. తాజాగా నగర కమిషనర్ రైల్వే గేట్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారనే చెప్పుకోవచ్చు. ఆరు రోజుల కిందట రైల్వే గేట్ల వద్ద ఆర్‌యూబీ, ఆర్వోబీ నిర్మాణానికి రైల్వే అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

రైల్వే గేట్ల సమస్యకు పరిష్కారం చూపాలి



అత్యవసర పనుల మీద పొరపాటున రైల్వే క్రాసింగ్‌ల మీదుగా వెళ్లాల్సి వస్తే నానా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. గేటు పడిన ప్రతి సారి పావుగంట నుంచి అరగంట దాకా వేచి ఉండాల్సిన పరిస్థితి. గేటు తీసినప్పటికి ట్రాఫిక్ నుంచి బయటకు రావాలంటే మరొక పావు గంట పడుతోంది. అధికారులు చొరవ తీసుకుని రైల్వే క్రాసింగ్‌ల వద్ద బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

–పి. జగదీష్‌కుమార్, నెహ్రూనగర్

త్వరలో రైల్వే బోర్డుకు తుది నివేదిక



నగరంలో శ్యామలానగర్, నెహ్రూనగర్, సీతానగర్, సంజీవయ్యనగర్, గడ్డిపాడు తదితర ప్రాంతాల్లో రైల్వే క్రాసింగ్ పాయింట్లు వద్ద ఆర్వోబీ, ఆర్‌యూబీ నిర్మాణం చేపడితే సదరు ప్రాంతాల్లో ఎన్ని భవనాలు ప్రభావితం అవుతాయి..వాటికి ఎంత నష్ట పరిహారాలు చెల్లించాలో తెల్పాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. వీలైనంత త్వరలో రైల్వే, నగరపాలక సంస్థ అధికారులతో కలసి తుది నివేదికలను రైల్వే బోర్డుకు పంపడం ద్వారా నిర్మాణ అనుమతులు వస్తాయి.

– కీర్తి చేకూరి, నగరపాలక సంస్థ కమిషనర్

చర్మవ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దు



మాట్లాడుతున్న డాక్టర్ అమర్

గుంటూరు మెడికల్: చర్మవ్యాధులు ప్రాణాంతకం కాకపోయినా, జీవన విధానం, పనితీరుపై ప్రభావం చూపుతాయని వైద్య నిపుణులు డి. అమర్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో భవనంలో ఆదివారం ఎస్‌హెచ్‌వో హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత చర్మవ్యాధుల వైద్య శిబిరంలో డాక్టర్ అమర్ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ఎస్‌హెచ్‌వో అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్ సారథ్యం వహించారు. డాక్టర్ అమర్ మాట్లాడుతూ మధుమేహ బాధితుల్లో బ్యాక్టీరియా, వైరల్, ఫంగల్ చర్మవ్యాధులు ఎక్కువగా వస్తాయని తెలిపారు. ముఖ్యంగా శరీరంలో తేమ ఎక్కువగా ఉండే ప్రాంతాలైన చంకలు, గజ్జలు, ప్రత్యుత్పత్తి అవయవాలు, కాలి వేళ్ల మధ్యలో చర్మవ్యాధులు ఎక్కువగా కనిపిస్తాయని చెప్పారు. అన్ని రకాల చర్మ వ్యాధులకు ఆయింట్మెంట్లు మాత్రమే పని చేయవని వెల్లడించారు. స్టెరాయిడ్స్ ఉన్న ఆయింట్మెంట్లను వైద్యుని సలహా లేకుండా అసలు వాడకూడదని సూచించారు. ఏ మందు ఏ చర్మ వ్యాధికి సమర్థంగా పనిచేస్తుందో వైద్యుల ద్వారా తెలుసుకుని వాడాలని తెలిపారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయరెడ్డి మాట్లాడుతూ ప్రజలు చర్మవ్యాధులకు అంతగా ప్రాధాన్యత ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుంటారని, వీటి ప్రభావం జీవన సరళిపై పడుతుందని తెలిపారు. డాక్టర్ టి. సేవ కుమార్ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌వో హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో ఆదివారం ఒక స్పెషలిస్ట్‌తో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు టి.ఉమామహేశ్వరరావు, చావ శివాజీ పాల్గొన్నారు.

జీజీహెచ్ అభివృద్ధికి దాతల సాయం వెలకట్టలేనిది



గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో సుమారు రూ.86 కోట్లతో నిర్మిస్తున్న మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) వెనుక దాతల సాయం వెలకట్టలేనిదని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. ఎంసీహెచ్‌కి సహకరిస్తున్న జింఖానా సభ్యులు డాక్టర్ మొవ్వ వెంకటేశ్వరరావు, మొవ్వ వేదవతిలను ఆయన ఆదివారం శుశ్రుత హాలులో సత్కరించారు. మొదటి అంతస్తు కు మొవ్వ వెంకటేశ్వరరావు రూ.4 కోట్లు ఇవ్వడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్. శ్రీనివాస ప్రసాద్, జింఖానా సమన్వయకర్తలు డాక్టర్ వెనిగళ్ల బాలభాస్కర రావు, డాక్టర్ హనుమంత రావు పాల్గొన్నారు.

రేపట్నుంచి దశావతార కల్యాణ మహోత్సవాలు



గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి దశావతార కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గజవల్లి వెంకటప్పారావు తెలిపారు. ఆదివారం ఆలయంలో ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరించారు. 12 నుంచి 21వ తేదీ వరకు దశ అవతారాలలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు జరుగుతాయని తెలిపారు. ప్రతి రోజు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు సుదర్శన హోమం, స్వామివారి కల్యాణం, తీర్థ ప్రసాదం పంపిణీ జరుగుతుందన్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు బంగారు దక్షిణావృత శంఖం ద్వారా తీర్థ ప్రసాదాలు అందజేయటం జరుగుతుందన్నారు. 23న ఉదయం స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ప్రతి పేదవాడి కలను సాకారం చేస్తున్న సీఎం జగన్



ప్రజాభిప్రాయాలు సేకరిస్తున్న నూరి ఫాతిమా

పట్నంబజార్: ప్రతి పేదవాడి కలను సాకారం చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా చెప్పారు. తూర్పు నియోజకవర్గంలోని 17వ డివిజన్ ఎల్ఆర్ కాలనీ, సుగాలీ కాలనీలో ఆదివారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూరీ ఫాతిమా మాట్లాడుతూ ప్రతి గడపకు సంక్షేమాన్ని దరిచేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని తెలిపారు. ప్రతి పేదవాడి కుటుంబంలో సంతోషాన్ని నింపే విధంగా సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతున్నారని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఫర్జాన, వైఎస్సార్ సీపీ నేతలు చిన్న, సుధాకర్ రెడ్డి, బికారి, నాగేశ్వరరావు, రాము, మురళి పాల్గొన్నారు.

సేంద్రియ కూరగాయలతోనే ఆరోగ్యం పదిలం

హార్టికల్చర్ డిప్యూటి డెరైక్టర్ వీఎస్ ధర్మజ



రైతుకు సర్టిఫికెట్‌కు అందజేస్తున్న డీడీ ధర్మజ

గుంటూరు రూరల్: సేంద్రియ కూరగాయలతో భూమి ఆరోగ్యాన్ని కాపాడుతూ.. ప్రజల ఆరోగ్యాన్ని మెరుగు పరచవచ్చని హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ వీఎస్ ధర్మజ అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో మూడు రోజులుగా జరుగుతున్న సేంద్రియ వ్యవసాయంపై రైతు శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో దొరికే కూరగాయలు చాలా వరకు రసాయనాలతో పండించినవేనన్నారు. చీడ పీడల నుంచి పంటను రక్షించుకోవడానికి విచక్షణా రహితంగా రసాయనాలను పిచికారి చేయాల్సి వస్తోందన్నారు. రసాయన అవశేషాలు ఉన్న కూరగాయలను ప్రజలు తినడం వల్ల వారి ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయన్నారు. దీనికి సరైన పరిష్కారం సేంద్రియ సాగేనని స్పష్టం చేశారు. రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేంద్రియ సాగు విధానం, కషాయాలు, మిశ్రమాల తయారీ, సేంద్రియ దిగుబడులకు మార్కెట్ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం శుభపరిణామమన్నారు. పంటల ఉత్పత్తుల నాణ్యత పెంచడంలో తేనెటీగలు ప్రముఖ పాత్ర వహిస్తాయని తేనె టీగల పెంపకందారు చలపతిరావు తెలిపారు. సాగులో విష రసాయనాలు సహజ సిద్ధమైన తేనెటీగల ఉనికికి ఇబ్బంది కలిగిస్తున్నాయన్నారు. తేనెటీగల పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం దొరుకుతుందన్నారు. బహుళ అంచెల సాగు విధానం, జీవ వైవిధ్యం ప్రాముఖ్యతను ప్రకృతి రైతు ఏడుకొండలు వివరించారు. వ్యవసాయంలో డ్రోన్‌ల పనితీరు, యాజమాన్య పద్ధతులను రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. అనంతరం రైతులకు సర్టిఫికెట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో రైతు నేస్తం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు

చేబ్రోలు: మండలంలోని వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఘనంగా జరిగాయి. దేవదాయశాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో వడ్లమూడి, నారాకోడూరు, సుద్దపల్లి పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సత్యనారాయణ స్వామి వ్రతంలో 108 మంది దంపతులు పాల్గొన్నారు. ఈవో పోతుల రామ కోటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అర్చకులు గూడురు శ్రీనివాస శర్మ, గోపి ఆధ్వర్యంలో అర్చక బృందం వ్రతం నిర్వహించింది.

శాలివాహన సంఘం కార్తిక వన సమారాధన

కాకుమాను: స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానలో శాలివాహన సంఘ సభ్యుల ఆధ్వర్యంలో కార్తిక మాస వన సమారాధన ఆదివారం సందడిగా జరిగింది. స్వామి వారికి సంఘ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరిగిన వన భోజనాల కార్యక్రమంలో పాల్గొన్నారు.



వన సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీటీసీ కానుగుల

పుస్తకం ఓ మంచి స్నేహితుడితో సమానం

- నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు
- విశాలాంధ్ర పుస్తక మహోత్సవం ప్రారంభం



బుక్ హౌస్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ కృష్ణదేవరాయలు

పాత గుంటూరు: పుస్తకం మంచి స్నేహితుడితో సమానమని, చదవడం వల్ల ఎన్నో విషయాలు అవగతం అవుతాయని నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు పేర్కొన్నారు. విశాలాంధ్ర బుక్ హౌస్ ఆధ్వర్యంలో గుంటూరు ఏఎల్ బీఈడీ కళాశాల ఆవరణలో 23వ పుస్తక మహోత్సవంలో భాగంగా ఆదివారం ఆయన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలంతా ఫోన్లు, సోషల్ మీడియాకు ఎక్కువగా దగ్గరవుతున్న నేపథ్యంలో పుస్తకాల పఠనం తగ్గిందని తెలిపారు. కానీ పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞానంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందన్నారు. పిల్లలు పుస్తకాల పఠనం వైపు మరలేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని ఆయన సూచించారు. పుస్తకాలను ప్రజలకు చేరువ చేసేలా గత 23 ఏళ్లుగా బుక్ ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్న విశాలాంధ్రకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన సమితి అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి టి. మనోహర్‌నాయుడు, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో పాల్గొన్న నూరి ఫాతిమా, డాక్టర్ నజీరుద్దీన్, డాక్టర్ షమా సుల్తానా

గుంటూరు మెడికల్: ఉచిత వైద్య శిబిరాల్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా సూచించారు. పొన్నూరు రోడ్డు హుస్సేన్ నగర్‌లో యువనారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్, హోప్ విన్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన వైద్యసేవల్ని అందిస్తున్న హోప్ విన్ హాస్పిటల్స్‌కు అభినందనలు తెలిపారు. హోప్ విన్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలలు, నగరంలోని మురికివాడల్లో ప్రతినెలా ఉచిత వైద్య శిబిరాలు, మహిళల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్ని చైతనవంతుల్ని చేస్తున్నామని చెప్పారు. సీనియర్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్, హోప్‌విన్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ నజీరుద్దీన్ మాట్లాడుతూ వైద్య శిబిరంలో 400 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు కూడా ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాహుల్‌రెడ్డి, జనరల్ మెడిసిన్ డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ రిజ్వానా, హాస్పిటల్ మేనేజర్ పి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సందడిగా 'బాలకుటీర్'లో లలిత కళా ఉత్సవం



సురేష్, భాగ్యలక్ష్మిని మంగాదేవి బాలసాహిత్య పురస్కారంతో సత్కరిస్తున్న మంగాదేవి

గుంటూరు ఎడ్యుకేషన్: శ్యామలానగర్‌లోని శ్రీ వేంకటేశ్వర బాలకుటీర్ 26వ లలిత కళా ఉత్సవాన్ని ఆదివారం సాయంత్రం మల్లారెడ్డినగర్‌లోని ఎంఎన్ఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకురాలు డాక్టర్ మంగాదేవి మాట్లాడుతూ పిల్లలకు ఆహ్లాదకరమైన విద్యను అందించి, ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తూ ముందుకు వెళుతున్నామని తెలిపారు. ఉన్నత రంగాల్లో రాణిస్తున్న పూర్వ విద్యార్థులే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ఏఎన్‌యూ పూర్వ ఉపకులపతి ఆచార్య వి. బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ విద్యతో పాటు విలువలకు ప్రాధాన్యమిస్తున్న బాలకుటీర్ విద్యావ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ పూర్వపు కమిషనర్ వాడ్రేవు చినవీరభద్రుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు యేటా లలిత కళా పోటీలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. పురస్కార గ్రహీతల్లో ఒకరైన మంచి పుస్తకం ప్రచురణ సంస్థ నిర్వాహకులు కె. సురేష్, పి.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ బాలల్లో సాంస్కృతిక విలువలను పెంపొందించి, మాతృభాషలో మాట్లాడే విధంగా మంచి పుస్తకం తరపున కృషి చేస్తున్నామని వివరించారు. మరొక పురస్కార గ్రహీత దేవనపల్లి వీణావాణి మాట్లాడుతూ వ్యక్తి వ్యవస్థగా మారే సంఘటన, సందర్భం తప్పక ఉంటాయని వివరించారు.

పురస్కారాల ప్రదానం

లలిత కళా ఉత్సవంలో భాగంగా మంచి పుస్తకం ప్రచురణకర్తలైన కొసరాజు సురేష్, పోతరాజు భాగ్యలక్ష్మికి ''మంగాదేవి బాల సాహిత్య'' పురస్కారం, తెలంగాణాకు చెందిన రచయిత్రి, అటవీశాఖ సహాయ కన్జర్వేటర్ దేవనపల్లి వీణావాణికి ప్రముఖ రచయిత్రి మాలతీ చందూర్ ప్రియ స్మృతిలో నెలకొల్పబడిన మాలతీ సాహితీ ప్రమదా పురస్కారం, నాలుగేళ్ల వయసులోనే సంగీత ప్రయాణాన్ని ప్రారంభించిన పోలవరపు సాధ్యను ప్రతిభా పల్లవ పురస్కారంతో సత్కరించి, నగదు బహుమతులను అందజేశారు. తెలుగు గిజుభాయ్, బాలల ప్రేమికుడు సీఏ ప్రసాద్‌కు ఆత్మీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం లలిత కళల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఉదయం జరిగిన లలిత కళా సంగీతోత్సవ ప్రారంభ సభకు ఆకాశవాణి విశ్రాంత డైరెక్టర్ ఎం.కృష్ణకుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌యూ విశ్రాంత ఆచార్యులు రావెల సాంబశివరావు, బాలకుటీర్ సహ కార్యదర్శి జయశ్రీ, సీఏవో వి.రఘురాం, చేతన ప్రతినిధి మరుద్వతి, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పొన్నూరులో బంద్ ప్రశాంతం



అంబేడ్కర్ విగ్రహం వద్ద పోలీసులు

పొన్నూరు: పట్టణంలో అంబేడ్కర్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎం. శ్రీనివాసరావు అనే వ్యక్తి అవమానకరంగా ప్రవర్తించిన ఘటనకు నిరసనగా దళిత సంఘాలు ఆదివారం నిర్వహించిన బంద్ ప్రశాతంగా సాగింది. పలువురు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. ఆర్టీసీ బస్సులు యథావిధిగా తిరిగాయి. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ముందస్తుగా దళిత సంఘాల నాయకులను గృహ నిర్బంధం చేశారు. ఈ ఘటనపై యువతను రెచ్చగొట్టే విధంగా చేసే కార్యకలాపాలు సాగించే వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుమారు 400 మంది పోలీసులు పట్టణ వ్యాప్తంగా మోహరించారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన వ్యక్తిని శిక్షించాలి

పొన్నూరు: అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనను నాయకులు ఖండించారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు మాట్లాడుతూ పట్టణంలో జరిగిన ఈ ఘటన వెనుక రాజకీయ ప్రమేయంపై విచారణ చేయాలని కోరారు. అంబేడ్కర్‌కు నివాళిగా ఐలాండ్ సెంటర్‌కు అంబేడ్కర్ సెంటర్‌గా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నామకరణం చేసి గౌరవించిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎంఏ.మహమ్మద్, నాయకులు బొద్దులూరి రంగారావు, కె. శ్రీనివాసరావు, శ్యామ్ పాల్గొన్నారు.